
పునరావాస కేంద్రాలకు తీర గ్రామాల ప్రజలు



భువనేశ్వర్ అగ్నిమాపక కేంద్రం నుంచి ఆధునిక సామగ్రితో సేవలకు సిద్ధమైన సిబ్బంది

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపాను ప్రభావం చూపితే ప్రజలను తరలించడానికి వీలుగా తీర ప్రాంతాల్లోని 250 పునరావాస కేంద్రాలను విపత్తుల నివారణ శాఖ సిద్ధం చేసింది. ఆయాచోట్ల ఆహార సామగ్రి, మందులు, మంచినీరు, అత్యవసర సామగ్రి ఏర్పాటు చేస్తున్నారు. 14 జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలవారిని ఈ కేంద్రాలకు బుధవారం సాయంత్రంలోగా తరలించాలని యంత్రాంగం నిర్ణయించింది. 500 పాఠశాల భవనాలను ఇందుకోసం వినియోగిస్తున్నట్లు రెవెన్యూ, విపత్తుల నివారణశాఖ మంత్రి సురేష్‌పూజారి మంగళవారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగితే ఆయాచోట్ల జనరేటర్లు ఉంటాయని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో అన్నం, దాల్మా, కూరగాయల ఇగురు వడ్డిస్తారని, సంచార వైద్య బృందాలను నియమిస్తున్నామన్నారు. జిల్లా పాలనాధికారులు, రెవెన్యూ, అత్యవసర శాఖల సిబ్బంది, బీడీఓలు, తహసీల్దార్లు సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. తీర గ్రామాలు పూర్తిగా ఖాళీ చేయిస్తామన్నారు. పరిస్థితి మెరుగయ్యే వరకు పోలీసులు గ్రామాలకు కాపలాగా ఉంటారని మంత్రి చెప్పారు.


గోపాల్‌పూర్ మత్స్యకారుల బస్తీలో పునరావాస కేంద్రం

సహాయ కార్యక్రమాలకు ఓడ్రాఫ్, అగ్నిమాపక జవానులు



సురేష్ పూజారి

● కేంద్రం హెలీకాప్టరు సమకూర్చిందన్న మంత్రి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపాను వల్ల ప్రభావితం కావచ్చునని అనుమానిస్తున్న 10 తీర జిల్లాలకు 17 ఓడ్రాఫ్ దళాలు, అగ్నిమాపక సిబ్బందిని తరలిస్తున్నట్లు రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖల మంత్రి సురేష్‌పూజారి చెప్పారు. మంగళవారం భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మనోజ్ అహూజా, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి మరోసారి సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రం అత్యవసర సేవలకు హెలీకాప్టరు కేటాయించిందని, అదనంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను పంపించాలని కేబినెట్ కార్యదర్శికి తెలియజేశామన్నారు. ఇదివరకు తుపానుల సమయాల్లో ప్రభావిత ప్రాంతాల్లో సమర్థంగా విధులు నిర్వహించిన అధికారులకు ఈసారి పర్యవేక్షకులుగా నియమిస్తున్నామన్నారు. చేపల వేటకు మత్స్యకారులు తీసుకెళ్లిన పడవలన్నీ ఒడ్డుకు చేరుకున్నాయని, అంతా ఇళ్లకు చేరుకున్నారని వివరించారు. కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, భద్రక్, బాలేశ్వర్ జిల్లాలు ఎక్కువగా ప్రభావితం అవుతాయన్న అంచనా ఉన్నందున ఆయా జిల్లాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ జవానులనూ సహాయ కార్యక్రమాలకు నియమిస్తున్నట్లు చెప్పారు. 24, 25 తేదీలు కీలకం కాగా, ఈ రెండు రోజులు అత్యవసర శాఖల సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. జలవనరుల శాఖ ఇంజినీర్లు నదుల పరివాహకాలు, జలాశయాలపై దృష్టి సారిస్తారని, దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతులు చేయడానికి ప్రజాపనుల శాఖ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ప్రాణనష్టం నివారించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినట్లు సురేష్ పునరుద్ఘాటించారు.

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే

తుపాను దిశ మార్చుకోనుందా..?


ఐఎండీ మంగళవారం విడుదల చేసిన వాయుగుండం దృశ్యం

గాలి వేగం 100 కి.మీ. పైనే..

తుపాను ఆచూకీ గురువారం సాయంత్రం రాడార్‌కు చిక్కుతుందని, దీని విస్తీర్ణం మరింత స్పష్టంగా కనిపిస్తుందని మనోరమ చెప్పారు. ఇది తీరం దాటే సమయంలో గాలి వేగం 100 నుంచి 110 కిలోమీటర్లు లేదా 120 కిలోమీటర్లు ఉండొచ్చన్నారు.

నేడు తీరం దాటే అవకాశం

తుపాను పూరీ, సాగర ద్వీపం (పశ్చిమబెంగాల్) మధ్య తీరం దాటుతుందని ఇంతవరకు ఐఎండీ అంచనా వేసింది. సుమారు 700 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడైనా తీరం దాటే అవకాశం ఉంది. ఒకవేళ ఈ విపత్తు రీకర్వ్ తీసుకుంటే భద్రక్ జిల్లాలోని ధమ్రా తీరం దాటుతుందన్న అంచనా.

నేడు తుపానుగా...

కేంద్ర బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం బుధవారం ఉదయం తుపానుగా మారనుంది. తరువాత ఇది ఉత్తర, పశ్చిమ దిశగా ఒడిశా తీరానికి చేరువవుతుంది. 24వ తేదీ రాత్రి లేదా 25 తెల్లవారుజామున తీరం దాటుతుందని ఐఎండీ అధికారవర్గాలు జారీ చేసిన తుపాను ట్రాక్ (దిశ) ద్వారా తెలుస్తోంది. రాష్ట్రానికి ఈ విపత్తు చేరువైన తరువాత దిశ మార్చుకొనే సూచనలు లేకపోలేదని విదేశీ మెట్ సంస్థలు పేర్కొన్నాయి. దీనిపై స్థానిక ఐఎండీ కేంద్రం సంచాలకురాలు మనోరమ మహంతి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ రీకర్వ్ జరగొచ్చు లేదా ఉత్తర, పశ్చిమదిశగా తీరాన్ని దాటొచ్చని చెప్పారు.


మనోరమ మహంతి

60 నుంచి 70 కిలోమీటర్లు..

వాయుగుండం ప్రభావంతో మంగళవారం సముద్ర ఉపరితలంలో గాలుల వేగం గంటకు 50 నుంచి 60 కిలోమీటర్లుగా ఉందన్నారు. బుధవారం (23న) ఇది 70 నుంచి 80 కిలోమీటర్లు కావచ్చన్నారు. గురువారం (24న) ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలుల తీవ్రత 85 నుంచి 95 కిలోమీటర్లుగా ఉంటుంది. తుపాను తీరం దాటే సమయంలో 110 నుంచి 120 కిలోమీటర్లు కావచ్చన్నారు. శుక్రవారం (25న) తీర ప్రాంతాల్లో గాలుల తీవ్రత 70 నుంచి 80 కిలోమీటర్లుగా ఉంటుందని అంచనా. తర్వాత వేగం తగ్గుతుంది. తుపానుల గాలి తీవ్రత ముందుగా అంచనా వేయలేమని, అది పెరగొచ్చు, తగ్గొచ్చని మనోరమ చెప్పారు.

తుపాను విపత్తు కచ్చితంగా ఎక్కడ తీరం దాటుతుందన్న దానిపై వాతావరణ అధ్యయన శాఖ (ఐఎండీ) కచ్చితంగా అంచనా వేయలేదు. మంగళవారం మధ్యాహ్నానికి పరదీప్ రేవుకు దక్షిణ, తూర్పుదిశలో 700 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉంది. ఇది గోపాల్‌పూర్, పరదీప్ రాడార్‌లకు అందలేదు. ఈ రెండు రాడార్ల పరిధి 500 కిలోమీటర్లు కాగా, బుధవారం నాటికి తుపానుగా మారనున్న వాయుగుండం దృశ్యాన్ని రాడార్లు పసిగట్టే సూచనలున్నాయి.

వైద్యుల సెలవులు రద్దు


డా. బిజయ్ మహాపాత్ర్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపానును దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యశాఖ వైద్యుల సెలవులు రద్దు చేసింది. తదుపరి ఆదేశాల వరకు సిబ్బంది ఎక్కడికీ వెళ్లరాదని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆరోగ్యశాఖ సంచాలకుడు డా॥బిజయ్ మహాపాత్ర్ మంగళవారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. ఈ వారం, పది రోజుల్లో ప్రసవించే అవకాశం ఉన్న గర్భిణులను ఆసుపత్రులకు తరలింపు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఆశ్రయ కేంద్రాలు, ఆసుపత్రుల్లో పాముకాటు, అతిసారం, జ్వరాలకు సంబంధించి మందుల నిల్వలు పెంచామన్నారు. సంచార వైద్య బృందాలను సిద్ధంగా ఉంచామని, పరిస్థితి తీవ్రతను బట్టి ఆయా ప్రాంతాలకు తరలిస్తామని తెలిపారు.



గోపాల్‌పూర్ డాప్లార్ రాడార్ ఐఎండీ కేంద్రం

పరీక్షలు వాయిదా... పాఠశాలలకు సెలవులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపాను వల్ల ప్రభుత్వం 23వ తేదీ నుంచి 25 వరకు జరగాల్సిన పరీక్షలన్నింటినీ రద్దు చేసింది. గంజాం, ఖుర్దా, పూరీ, జగత్సింగ్‌పూర్, కేంద్రపడ, భద్రక్, బాలేశ్వర్, మయూర్‌భంజ్, కేంఝర్, ఢెంకనాల్, జాజ్‌పూర్, అనుగుల్, నయాగఢ్, కటక్ జిల్లాల్లో పాఠశాలల మూసివేతకు ప్రత్యేక రిలీఫ్ కమిషనర్ దేవ్‌రంజన్‌కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

● రాడార్‌కు ఇంకా అందని తుపాను దృశ్యం

● గాలుల తీవ్రత స్పష్టం చేసిన ఐఎండీ

నేటి సాయంత్రం నుంచి వర్షాలు

ఓడరేవులకు 1వ నెంబరు ప్రమాద హెచ్చరిక

గోపాలపూర్, న్యూస్‌టుడే: కేంద్ర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం మధ్యాహ్నం తీవ్ర వాయుగుండంగా మారిందని, బుధవారం ఉదయానికిది తుపానుగా మారనుందని స్థానిక వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) సంచాలకురాలు మనోరమ మహంతి 'న్యూస్‌టుడే'కు చెప్పారు. గురువారం నాటికి తుపాను తీవ్రరూపం దాలుస్తుందని, అదేరోజు రాత్రి లేదా శుక్రవారం ఉదయం పూరీ, సాగరద్వీపం (బెంగాల్) మధ్య తీరం దాటుతుందన్నారు. ప్రస్తుతం పరదీప్‌కు 700 కిలోమీటర్ల దూరంలో దక్షిణ, తూర్పుదిశలో ఉన్న ఈ విపత్తు గంటకు 6 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ, ఉత్తర దిశగా తీరం వైపునకు కదులుతున్నట్లు తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పూరీ, గోపాల్‌పూర్, ధమ్రా, పరదీప్ ఓడరేవులకు 1వ నెంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేశామన్నారు. బుధవారం ఉదయానికి 3వ నెంబరు హెచ్చరికలు జారీ చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం నుంచి రాష్ట్రంలో వానలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. బుధవారం బాలేశ్వర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, పూరీ జిల్లాల్లో మోస్తరు వర్షాలకు అవకాశమున్నందున 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేశామన్నారు. గురువారం (24న) కటక్, జాజ్‌పూర్, బాలేశ్వర్, భద్రక్, కేంద్రపడ, జగత్సింగ్‌పూర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే సూచనలున్నందున 'రెడ్' అలర్ట్ ప్రకటించామన్నారు. గంజాం, కేంఝర్, అనుగుల్, ఢెంకనాల్, నయాగఢ్, ఖుర్దా, పూరీ జిల్లాల్లోనూ భారీ వర్షాలకు అవకాశం ఉన్నందున ఆరెంజ్ హెచ్చరికలు, కోస్తాలోని ఇతర జిల్లాలకు 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేశామన్నారు.



మత్స్యకారుల ఆందోళన

తుపాను తీవ్రంగా ఉంటే తాము కొన్నిరోజులు ఉపాధి కోల్పోతామని, పడవలు, వలలు దెబ్బతినే అవకాశం ఉందని పలు జిల్లాల మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రభుత్వం ప్రత్యేక భృతి ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

అత్యవసర సేవలకు విద్యుత్తు సరఫరా


హేమంతశర్మ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపాను వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగినా, అత్యవసర సేవలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని విద్యుత్తు శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి హేమంతశర్మ మంగళవారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. ఆసుపత్రులు, మంచినీటి సరఫరాకు అంతరాయం లేకుండా శక్తివంతమైన జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రైవేటు కంపెనీలు ఇవి సమకూర్చనున్నాయన్నారు. గాలుల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రమాదాలు జరగకుండా ముందుగా సరఫరా నిలిపేస్తామన్నారు. తుపాను వల్ల విద్యుత్ శాఖకు కచ్చితంగా కొంతమేరకు నష్టాలు వాటిల్లుతాయన్నారు. తరువాత యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయడానికి వీలుగా సామగ్రి సిద్ధంగా ఉంచామన్నారు. 500 విద్యుత్తు నియంత్రికలు (ట్రాన్స్‌ఫార్మర్లు), 8000 స్తంభాలు, ఇతర యంత్ర సామగ్రిని తుపానుతో ప్రభావితం కానున్న జిల్లాలకు తరలిస్తున్నామన్నారు. పనులు త్వరగా చేపట్టడానికి, సరఫరా పునరుద్ధరణకు ప్రాధాన్యమిచ్చిన ప్రభుత్వం తాత్కాలిక సిబ్బందినీ నియమిస్తున్నట్లు శర్మ చెప్పారు.


గోపాల్‌పూర్ తీరంలో ఒడ్డుకు చేర్చిన పడవలు


హేమంత శర్మ





పెరుగుతున్న భూగర్భ జల వినియోగం... భవిష్యత్ ప్రశ్నార్థకం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే

రాష్ట్రంలో ఏటికేడు భూగర్భజలాల వినియోగం విపరీతంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ విచ్చలవిడి వెలికితీతతో భావితరాల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మిగులుతోంది. గడిచిన దశాబ్దంలో రాష్ట్రంలోని భూగర్భజలాల వెలికితీత 18 శాతం పెరగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఒడిశా భూగర్భ జల వనరుల అంచనా-2024 నివేదికలో తాజాగా ఈ వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలో నీటి వినియోగం 48.23 శాతానికి చేరుకుంది. 2013లో ఇది 30 శాతం కాగా, ఏడాదికి 1.9 శాతం మేర పెరిగింది. కేంద్ర భూగర్భ జల బోర్డు (సీజీడబ్ల్యూబీ), రాష్ట్ర భూగర్భ జలాల అభివృద్ధి సంచాలక శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ సర్వేలో పలు అంశాలు వెలుగుచూశాయి. 2022-23తో పోలిస్తే 2023-24లో తక్కువ వర్షపాతం నమోదై భూగర్భ జలాల రీఛార్జ్ తగ్గి, నీటి వినియోగం పెరిగింది. రాష్ట్రంలో ఉన్న 314 సమితులకుగాను 219 సమితుల్లో 70 శాతం లోపు భూగర్భ జలాల వెలికితీత జరగగా, 6 సమితుల్లో పూర్తి ఉప్పు నీటితో కూడిన జలాలున్నాయి. మరో 9 సమితుల్లో ఈ వినియోగం 70 శాతానికి మించి ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు నివేదిక బహిర్గతం చేసింది.

వ్యవసాయ అవసరాలకు ఎక్కువ

రాష్ట్రంలో 2023-24లో 17.46 బిలియన్ క్యూబిక్ మీటర్ల(బీసీఎం) మేర భూగర్భజలాలు ఉన్నట్లు అంచనా.. గతేడాదిలో 17.35 బీసీఎంల రీఛార్జ్ జరిగినట్లు పేర్కొంది. 1.42 బీసీఎంలు సహజంగా ఇంకిపోయిన అనంతరం వాటిస్థాయి 16.04 బీసీఎంలకు చేరుకున్నట్లు నివేదిక స్పష్టం చేసింది. ప్రస్తుతం అత్యధిక శాతం వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. నీటి పారుదలకు 6.28 బీసీఎంల వెలికితీత జరుగుతుండగా, జీవన వినియోగానికి 1.26 బీసీఎం, పారిశ్రామిక వినియోగానికి 0.19 బీసీఎంలు వెలికితీస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. భవిష్యత్ అవసరాల కోసం 8.26 బీసీఎంలు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఝార్సుగూడ వంటి వెనుకబడిన జిల్లాలోని మూడు సమితుల్లో భూగర్భ జలాల పరిస్థితి కాస్త మెరుగుకావడం గమనార్హం. జిల్లాలోని బలియాపల్‌లో గతంలో 88.52 శాతంగా ఉన్న వినియోగం 83.19 శాతానికి తగ్గగా, కోరేయిలో 84.02 శాతం నుంచి 76.52 శాతానికి, ఝార్సుగుడలో 72.56 శాతం నుంచి 70.85 శాతానికి వినియోగం తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది.

● దశాబ్ద కాలంలో 18 శాతం పెరిగిన నీటి వెలికితీత


సాగు కోసం భూగర్భజలాల వాడకం

మత్స్యకారుల శ్రమదానం... పడవ ప్రయాణానికి మార్గం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే


చేపల వేటపై ఆధారపడుతున్న ఆ మత్స్యకారులు సాగర తీరాన జట్టీ లేక పడవలపై సముద్రంలోకి వేటకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. తమ ప్రాంతంలో జట్టీ ఏర్పాటు చేయాలని దీర్ఘకాలంగా ప్రజాప్రతినిధులు, అధికారులకు కోరుతున్నా ఎలాంటి ఫలితం లేకపోయింది. దీంతో బాహుదా నది శాఖ సముద్రంలో కలిసే చోట నీటిని నిలిపి ఉంచేందుకు అడ్డుగా ఇసుక బస్తాలు వేయాలని యోచించారు. ఇందుకోసం గట్టు నిర్మాణాన్ని శ్రమదానంతో చేపట్టారు. గంజాం జిల్లా రొంగాయిలొండ సమితిలో మార్కండి గ్రామంలోని సాగర తీరాన నది, సముద్రం సంగమం వద్ద పది గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇందుకు విరాళాలు సేకరించారు. వేలాది ఇసుక బస్తాలను తీరానికి సమీపంలో గట్టుగా ఏర్పాటు చేస్తున్నారు. ఇంతవరకూ నీటిలో పది అడుగుల వరకూ ఇసుక బస్తాలు వేశామని, మరో అయిదు అడుగుల ఎత్తు వరకూ వీటిని వేస్తామని మత్స్యకారులు రుద్రయ్య, ఎన్. జగ్గారావు, ఎం. పితంబరరావు, జి. నాగేశ్వరరావు మంగళవారం విలేకరులకు చెప్పారు. ఇలా చేస్తే మూడు నెలల వరకు తమకు ఇబ్బందులు ఉండవని వివరించారు. ఈ తాత్కాలిక గట్టు వల్ల నీరు నిలిచి ఉండి సముద్రంపైకి పడవలు సాఫీగా వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ పడవలు సముద్రంపైకి సాఫీగా వెళ్లడానికి, తిరిగి రావడానికి వీలుగా నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

సాగర తీరాన ఇసుక బస్తాలు మోసుకు వెళుతున్న మత్స్యకారులు





ముఖద్వారం సమీపాన సాగరంలో గట్టు ఏర్పాటు

నవంబరు 15 న రాష్ట్రానికి ప్రధాని మోదీ



భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ నవంబరు 15న ఒడిశా పర్యటనకు వస్తున్నారు. రవుర్కెలాలో ఏర్పాటయ్యే గిరిజన దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. భాజపా ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించిన సహీద్ మాధోసింగ్ ఉపకార వేతనం (స్కాలర్ షిప్) పథకాన్ని ఆయన ప్రారంభిస్తారు. 450 ప్రాథమిక ఆశ్రమ పాఠశాలల భవనాలు, ఒడియా సాహిత్య ప్రతిష్టా కేంద్రం నిర్మాణం పనులకు శంకుస్థాపన చేస్తారని భాజపా అధికార వర్గాలు మంగళవారం సాయంత్రం భువనేశ్వర్‌లో తెలిపాయి. నవంబరు 15న 11 గంటలకు ఝార్సుగుడకు వాయుసేన విమానంలో చేరుకోనున్న ప్రధాని, ఇక్కడ నుంచి హెలికాప్టరులో రవుర్కెలా వస్తారు. ఈ కార్యక్రమం తరువాత దిల్లీ ప్రయాణమవుతారని పేర్కొన్నాయి.

తల్లి సన్నిధిలో సీఎం దంపతుల పూజలు


భువనేశ్వర్‌లోని లక్ష్మీబజారు ఆవరణలో ఏర్పాటైన గజలక్ష్మీ పెండాల్‌లో సతీసమేతంగా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా గజలక్ష్మీ పూజలు కొనసాగుతున్నాయి. ఆకర్షణీయమైన పెండాళ్లు ఏర్పాటయ్యాయి. శుక్రవారం వరకు ఈ వేడుకలు జరగాల్సి ఉండగా, తుపాను దృష్టిలో పెట్టుకుని పూజా సంఘాలు ముందుగా విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి సతీసమేతంగా భువనేశ్వర్ లక్ష్మీబజారు ఆవరణలో ఏర్పాటైన పెండాళ్‌ను దర్శించారు. గజలక్ష్మీ సన్నిధిలో పూజలు చేశారు. విపత్తుల బారి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించాలని ప్రార్థించారు.


జగన్నాథ్ సాగరంలో సర్వే ప్రారంభం


జయనగర్ ప్రాంతంలో పడవపై అధికారులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణ చారిత్రాత్మక జగన్నాథ్ సాగరంలో నీటి నాణ్యత, వ్యర్థాలు, మట్టి తొలగింపు తదితర అంశాలపై పరిశీలనకు హైదరాబాద్ నుంచి ఇద్దరు అధికారులు వచ్చినట్లు పురపాలిక ఈఓ కృతిబాస్ తెలిపారు. అధికారులు శ్రీనివాస్, సాయి మంగళవారం పడవలో సాగరం మధ్యకు వెళ్లి జీపీఎస్‌కు అనుసంధానం చేసిన కెమెరా, వాటర్‌మీటరును నీటిలో విడిచిపెట్టారు. నీటిలోని వ్యర్థాల తొలగింపు పనులను దీని ద్వారా పరిశీలించారు. ఈ ఏడాది జూన్ 21న సాగరంలో పూడికతీత, చెత్త, నీటి తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. బిజద ప్రభుత్వం దీని అభివృద్ధికి రూ.14 కోట్లు మంజూరు చేసింది. అనంతరం భాజపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంజూరైన నిధులు పురపాలికకు అందకపోవడంతో గత 45 రోజుల క్రితం పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు అధికారుల రాకతో మళ్లీ పనులు ప్రారంభమవుతాయాని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి సహకరించాలి

● టోకు వ్యాపారులతో మంత్రి సమావేశం


కటక్ చౌధురీబజార్ కూరగాయల మార్కెట్


కృష్ణచంద్రపాత్ర్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో మార్కెట్లలో ధరలు మండి కనిపిస్తోంది. దీన్ని అదనుగా తీసుకున్న వ్యాపారులు అమాంతం ధరలు పెంచేశారు. ఏ నిమిషానికి ఏమవుతుందో? సామగ్రి అందుబాటులో ఉండకపోవచ్చన్న అనుమానాలతో ప్రజలు నాలుగైదు రోజులకు సరిపడా కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా ఉల్లి, ఆలూ పాడయ్యే పరిస్థితి లేదు. దీన్ని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆలూ కిలో రూ.50లుగా కాగా, ఉల్లి రూ.60 నుంచి రూ.70లకు విక్రయిస్తున్నాయి. టమాటా, గోబి, వంకాయలు, బీన్స్ తదితర కూరగాయలన్నీ మండుతున్నాయి. ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్ర్ రాష్ట్రంలో నిత్యావసర సామగ్రి, కూరగాయలకు ఎలాంటి కొరత లేదని నిన్నగాక మొన్న చెప్పారు. కృత్రిమ కొరత సాకుగా చూపించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్న హెచ్చరికలు వ్యాపారులు ఖాతరు చేయలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో మంత్రి టోకు వ్యాపారులతో సమావేశమయ్యారు. తుపానును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టిన తరుణంలో వ్యాపారులు సహకరించాలని, కృత్రిమ కొరత సృష్టించవద్దని కోరారు. అనంతరం పాత్ర్ విలేకర్లతో మాట్లాడుతూ తమ శాఖ అధికారులు, సిబ్బంది అన్ని నగరాలు, పట్టణాల్లోని మార్కెట్లపై నిఘా ఉంచారన్నారు. వారు ఆయాచోట్ల సోదాలు చేస్తారని, అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. చిల్లర వ్యాపారులకూ ఇది వర్తిస్తుందన్నారు.

అలుగును రక్షించిన అటవీ అధికారులు


గుడారిలో పట్టుకున్న అలుగు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుడారి సమితి పెండిలి పంచాయతీ రొంగమట్టి గ్రామం సమీప భూమిలో ఉన్న అలుగును అటవీ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే సోమవారం సాయంత్రం గుడారి ఆ శాఖ సిబ్బంది రొంగమట్టి గ్రామానికి వెళ్లారు. అక్కడ సమీప భూమిలో ఉన్న అలుగును పట్టుకొని గుడారి రేంజరు కార్యాలయానికి తీసుకెళ్లారు. ఏసీఎఫ్ సందీప్ పృష్టి, గుడారి రేంజరు దిలీప్ కుమార్ పట్నాయక్ పశు వైద్యుడిని పిలిపించి ఆరోగ్య పరీక్షలు చేశారు. పూర్తి ఆరోగ్యంగా ఉండడంతో వైద్యుడి సూచనల మేరకు దానిని మంగళవారం ఉదయం ఒంధారలిమ్మ రిజర్వు ఫారెస్టు(సంరక్షిత అడవి) లో సురక్షితమైన ప్రాంతంలో వదిలి పెట్టారు.

వంతెనపై రాకపోకలు సాగించేదెలా?



గజపతి జిల్లా ముఖ్య పట్టణమైన పర్లాఖెముండి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో పాతపట్నానికి అనుసంధానం చేస్తూ మహేంద్రతనయ నదిపై 2018లో వంతెన నిర్మించారు. దీన్ని అప్పటి ముఖ్యమంతి నవీన్‌పట్నాయక్ ప్రారంభించారు. ఆరేళ్ల కిందట నిర్మించిన వారధిపై గుంతలు ఏర్పడడంతో పాటు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టి బిల్లులు చేసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ వంతెన పక్కన ఉన్న రాజులకాలం నాటిది నేటికి బాగానే ఉంది. పనుల్లో నాణ్యత లోపించడం దీనికి కారణం అని తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి తక్షణమే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, పర్లాఖెముండి

బజార్లలో నిత్యావసరాల నిల్వలు పరిశీలన


బజారులో నిత్యావసరాల నిల్వలు పరిశీలిస్తున్న అధికారుల బృందం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికల నేపథ్యంలో బ్రహ్మపుర సబ్ కలెక్టరు కార్యాలయం పరిధిలోని సహాయ పౌరసరఫరా అధికారి (ఏసీఎస్‌ఓ) బ్రహ్మపుర బజార్లలో పరిస్థితిని పరిశీలించేందుకు మంగళవారం ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. బృందం సభ్యులు నగరంలోని టోకు, చిల్లర బజార్లలో అటుకులు, బెల్లం, ఆలూ, ఉల్లి, పప్పు దినుసులు, వంటనూనెలు తదితర నిల్వలు పరిశీలించి వివరాలు సేకరించారు. ఆయా నిత్యావసరాలు అవసరమైనంత మేరకు నిల్వలుంచాలని బృందం సభ్యులు వ్యాపారులకు సూచించారు.

యువతి ఆత్మహత్య

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా కలిమెల ఎం.వి 70 గ్రామంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎం.వి 70 గ్రామానికి చెందిన ఆకాశ్‌దాష్ భార్య కరుణదాస్ (22) ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో పంకాకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొంత సమయానికి చూసిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాని చేరుకున్నారు. మృతదేహాన్ని పరీక్షకు పంపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఒకరి మృతి-ఇద్దరికి గాయాలు

రాయగడ (గ్రామీణం),న్యూస్‌టుడే; రాయగడ జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఒక యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చందిలి పోలీసు స్టేషన్ కొలనార సమితి తెరువళి పంచాయతీ పాయకపాడ వద్ద రాయగడ వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తెరువలి ఆదివాసి వీధికి చెందిన సమీర్ పరసక(18) మృతి చెందాడు. ★ కాశీపూర్ సమితి పోడపది పంచాయతీ నారింగిజోడి గ్రామ సమీపంలో టికిరి వస్తున్న బొలెరో వాహనాన్ని ఎదురుగా మైకంగ్ గ్రామం నుంచి మోటారు బైక్‌తో వస్తున్న గోవింద జోడియా(20), కేవన జోడియా(22) ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం రాయగడ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదాలకు కారణం మితిమీరిన వేగమని చెప్పారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న వాహనం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: ఓ వాహనం చెట్టుకి ఢీకొని ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం చిత్రకొండ సమితి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు రాష్ట్రం కొత్తగూడెం మండలం ముద్దగెడ్డ గ్రామానికి చెందిన ప్రకాష్‌బల్లే ఇద్దరు కుమారులు, కుమార్తెలను నరసింహపట్నంలో ఆశ్రమ పాఠశాలలో విడిచిపెట్టేందుకు వెళ్తున్నారు. చిత్రకొండ సమితి రాజులకొండ గ్రామం వద్ద వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది. వెంటనే స్థానికులు క్షతగాత్రులను చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రకాష్‌బల్లే పెద్ద కుమార్తె రాసోబీలో (15) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు.

భార్యల హత్య కేసుల్లో నిందితులకు జైలుశిక్ష

నవరంగపూర్, న్యూస్‌టుడే: భార్యలను హత్య చేసిన కేసుల్లో ఇద్దరు నిందితులకు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. సాక్ష్యాధారాల ఆధారంగా పోక్సో న్యాయమూర్తి సుభద్ర మహంతి ఒకరికి యావజ్జీవ, మరొకరికి ఎనిమిదేళ్ల కారాగార శిక్ష విధిస్తున్నట్లు మంగళవారం తీర్పునిచ్చారు. న్యాయవాది మనోజ్‌కుమార్ ఎక్కా తెలిపిన వివరాలు ప్రకారం.. పపదహండి రాణా పరిధిలో గుమిదొర గ్రామానికి చెందిన గోవింద్‌నాయక్ 2015 సెప్టెంబరు 25న తన భార్య అనితా ప్రధాన్‌ను గొంతు నులిమి హత్య చేశాడు. ఆ తర్వాత పంకాకు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి హత్యగా నిర్ధారించారు. ఈ కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.20 వేలు జరిమానా విధించారు.★ రెండో కేసు వివరాలు ఇలా ఉన్నాయి. కొసగుముడా రాణా పరిధిలో బజ్రగుడ గ్రామానికి చెందిన సన్‌సాయి రంధారి 2017, అక్టోబరు 25వ తేదీన తన భార్య హిరా దేయిబొత్రాకి మధ్య ఏదో విషయంపై గొడవ జరిగింది. ఉద్వేగంతో సన్‌సాయి ఆమె తలపై ఇనుపరాడ్డుతో దాడి చేశాడు. ఈ దాడిలో భార్య మృతి చెందింది. హీరాదేయి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు సన్‌సాయిని అరెస్టు చేశారు. విచారించిన న్యాయస్థానం సన్‌సాయికి ఎనిమిదేళ్ల జైలు శిక్ష, రూ.15 వేల జరిమానా విధించారు.

దారి దోపిడీ దొంగల అరెస్టు

కొరాపుట్, న్యూస్‌టుడే: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను, దారి దోపిడీ దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. కొరాపుట్ టౌన్ పోలీస్‌స్టేషన్ అధికారి రంజిత్‌మిశ్రా తెలిపిన వివరాల ప్రకారం దిల్లీకి చెందిన యువకుడు హేమసింగ్ మౌర్య, ఆల్లోమస్‌బాల్ గంజాయి తరలించేందుకు సిద్ధమవ్వగా రైళ్లు అందుబాటులో లేకపోవడంతో ఒక ఆటో చోదకుడు మోహన్‌నాగ్‌తో తమను లాడ్జికి చేర్చాలని మాట్లాడుకున్నారు. ఇద్దరు ఆటోలో వెళ్తుండగా చోదకుడు కొరాపుట్ దాటి ఉమ్మి రోడ్డు వైపు తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న రవి టీకాదర్, హరిజన్ మోహన్‌తో కలిసి యువతీయువకులను బెదిరించారు. వారి వద్ద నుంచి రూ. 12 వేల నగదు, చరవాణి దోచుకొని పరారయ్యారు. విషయం తెలుసుకున్న కొరాపుట్ టౌన్ పోలీస్‌స్టేషన్ అధికారి ఆ ఇద్దరి దిల్లీ వాసులను అదుపులోకి తీసుకుని 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మౌర్య ఇచ్చిన ఫిర్యాదుతో దారి దోపిడీ దొంగలు ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

దాడి చేసి.. సొమ్ము కాజేసి..

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా నిమ్మఖండి రాణా పరిధిలోని రుషికుల్య ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వారు చేసిన సామూహిక దాడిలో బాబు సాహు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను తక్షణమే ఎమ్కేసీజీ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు ఆరా తీస్తున్నారు.

రూ.36 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లాలో అక్రమ గంజాయి రవాణా అరికట్టేందుకు పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం ఆర్.ఉదయగిరి రాణా పరిధిలోని పదమర గ్రామ ప్రాంతంలో ఎస్‌ఐ సందీప్ హేమరమ్ ఓ బృందంతో సోదాలు చేయగా ఆటు వైపుగా వస్తున్న కారును ఆపి పరిశీలించారు. గంజాయి రెండు క్వింటాళ్లతో 16 కిలోల 500 గ్రాములు లభ్యమైంది. వీటి విలువ రూ.36 లక్షల 49 వేల 500లు ఉంటుందని అంచనా వేశారు. ఎస్పీ జితేంద్రకుమార్ పండా మంగళవారం విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఆర్.ఉదయగిరి రాణా అధికారి సబ్యసాచి మల్లో తదితరులు పాల్గొన్నారు.

బలిమెలలో 200 కిలోల పట్టివేత...

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు 200 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బలిమెల రాణా అధికారి ధిరేన్ పట్నాయక్ నేతృత్వంలో పోలీసు బృందం అడవిలో దాడిచేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 8 బస్తాల్లో 200 కిలోల గంజాయి లభ్యమైంది.


ఛాంపియన్ బహుమతులతో గంజాం స్కౌట్స్, గైడ్స్‌లు

రాష్ట్రస్థాయి పోటీల్లో గంజాంకు బహుమతులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో సుందర్‌గడ్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు రాష్ట్ర పాఠశాలల హాకీ, విలువిద్య పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సుందర్‌గడ్‌లోని భవానీపూర్ క్రీడామైదానంలో మంగళవారం జరిగిన హాకీ మ్యాచులో సుందర్‌గడ్ జట్టు క్రీడాకారులు 4-0 గోళ్ల తేడాతో గంజాం జట్టు క్రీడాకారులను ఓడించారు. దీంతో గంజాం జట్టు ద్వితీయ బహుమతి అందుకుంది. భువనేశ్వర్‌లో కొద్దిరోజులుగా జరుగుతున్న రాష్ట్ర భారత్ స్కౌట్స్, గైడ్స్ -2024 శిబిరం సోమవారం రాత్రి ముగిసింది. ఇందులో మొత్తం ఛాంపియన్‌గా గంజాం స్కౌట్స్, గైడ్స్ కేడెట్లు నిలిచారని గంజాం జిల్లా శారీరక విద్యాధికారి భగీరథ స్వయిన్ సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

రాష్ట్ర చదరంగం విజేతలు


బహుమతులతో విజేతలు. చిత్రంలో అతిథులు, నిర్వాహకులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా చదరంగం సంఘం, కటక్ జిల్లా చదరంగం సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కటక్ బారబటి క్రీడామైదానంలో ఈ నెల 19 నుంచి 21 వరకు రాష్ట్రస్థాయి అండర్-15 చదరంగం పోటీలు జరిగాయి. ఇందులో లలితరంజన్ సాహు, జయలక్ష్మి సాహు జోడి టైటిలును గెలుచుకున్నారు. వీరిద్దరు 6.5 పాయింట్లతో విజేతగా నిలవగా, ఆర్యన్ బెహరా, శ్రద్ధా స్మరణిక నంద ద్వితీయ స్థానంలో నిలిచారు. ముగింపు చౌద్వార్ కటక్ శాసనసభ్యుడు సౌవిక్ బిశ్వాళ్ విజేతలకు బహుమతులందజేశారు.

భంజవిహార్‌లో అంతర్ కళాశాల బ్యాడ్మింటన్ పోటీలు


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న పీజీ కౌన్సిల్ ఛైర్మన్ త్రిపాఠి. చిత్రంలో సాహు, మిశ్ర

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర విశ్వవిద్యాలయం, క్రీడల మండలి ఆధ్వర్యంలో 54వ అంతర్‌కళాశాల పురుషుల బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. భంజవిహార్‌లోని క్రీడల మండలి ఇండోర్‌హాల్లో ఏర్పాటైన పోటీలను పీజీ కౌన్సిల్ ఛైర్మన్ ఆచార్య సుకాంతకుమార్ త్రిపాఠి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు క్రీడల్లో కూడా ప్రతిభ చాటాలని, అంతర్ కళాశాల పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చూపి అంతర్వర్సిటీ పోటీలకు ఎంపికయ్యేలా కృషిచేయాలని ఆయనన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం క్రీడల మండలి కార్యదర్శి శారద ప్రసాద్ సాహు, భంజవిహార్ క్రీడాధికారి రబిచరణ్ మిశ్ర, రాజేష్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు


రోహిత్‌పాత్రోకి మిఠాయి తినిపిస్తున్న ఉపకులపతి

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్‌కి చెందిన రోహిత్‌పాత్రో దక్షిణాఫ్రికాలో జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. రోహిత్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో డిగ్రీ మొదట సంవత్సరం చదువుతున్నాడు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. చక్రధర్ త్రిపాఠి అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థిని కొనియాడారు.

అండర్-II ఛాంపియన్‌గా ఆరాధన

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్‌కి చెందిన ఆరాధన బేబర్త రాష్ట్ర అండర్-11 బ్యాడ్మింటన్‌లో ఛాంపియన్‌గా నిలిచింది. దీంతో జిల్లావాసులతో పాటు కొరాపుట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ తరపున క్రీడాకారిణిని అభినందించినట్లు కార్యదర్శి శైలేంద్రచౌదరి తెలిపారు.


ఛాంపియన్ ట్రోఫీ అందుకున్న ఆరాధన


చిలికా సరస్సులో పక్షుల సందడి

చిలికాలో వలస పక్షుల సందడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని చిలికా సరస్సుకు విదేశీ అతిథులు వలస పక్షుల రాక ప్రారంభమైంది. గంజాం, పూరీ, ఖుర్దా జిల్లాలకు విస్తరించిన చిలికాకు ఏటా శీతాకాలంలో లక్షలాది విదేశీ, స్వదేశీ పక్షులు వలసకు వస్తుంటాయి. వీటిని తిలకించేందుకు పర్యాటకులు వస్తుంటారు. అక్టోబరు మొదటి వారం నుంచే పక్షుల రాక ప్రారంభమైందని చిలికా వన్యప్రాణి డివిజన్ అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) అమ్లాన్ నాయక్ మంగళవారం విలేకరులకు చెప్పారు. పక్షుల భద్రతకు చిలికా వన్యప్రాణి డివిజన్ పరిధిలోని అయిదు రేంజ్‌లలో తాత్కాలికంగా 21 శిబిరాలు ఏర్పాటయ్యాయన్నారు. వేటగాళ్ల నుంచి రక్షణకు సరస్సులో పడవల ద్వారా, ఒడ్డున కాలి నడకన సిబ్బంది గస్తీ నిర్వహిస్తుతున్నారు. ఈ ఏడాది జనవరిలో చిలికాలో నిర్వహించిన లెక్కింపుల్లో 187 స్వదేశీ, విదేశీ జాతులకు చెందిన 11,37,759 పక్షుల్ని అధికారులు లెక్కించిన సంగతి గమనార్హం.

తుపాను కారణంగా పలు రైళ్లు రద్దు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం-గుణుపురం, పూరీ-గుణుపురం మధ్య రాకపోకలు కొనసాగిస్తున్న ప్యాసింజర్లు, కటక్-గుణుపురం మధ్య తిరుగుతున్న మెమో రైలుతో పాటు రపుర్లోల-గుణుపుర మధ్య తిరుగుతున్న రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైళ్లు 24, 25 తేదీలలో రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని అన్నారు.

ఓఎస్ఎస్ఎస్‌సీ అధ్యక్షునిగా లలిత్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఐపీఎస్ విశ్రాంత అధికారి లలిత్‌దాస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఒడిశా సబ్ ఆర్డినేట్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఓఎస్ఎస్ఎస్‌సీ) అధ్యక్షునిగా నియమించింది. కమిషన్ సభ్యులుగా ఊర్మిళ చంద్రమాఝి, సరోజ్‌కుమార్ మిశ్రా నియమితులయ్యారు. మంగళవారం రాత్రి ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పర్లాఖెముండిలో జనసంపర్క యాత్ర

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: బిజద పార్టీ అధ్యక్షుడు నవీన్‌పట్నాయక్ పిలుపుమేరకు మంగళవారం సాయంత్రం పర్లాఖెముండి పట్టణంలో జనసంపర్క యాత్ర నిర్వహించారు. శాసనసభ్యుడు రూపేష్ పాణిగ్రహి, లోకసభ అభ్యర్థి బృగుబక్షిపాత్ర్, పురాధ్యక్షురాలు నిర్మలసెరి తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల్లో ప్రకటించిన హామీలను అమలు పరచడంలో భాజపా విఫలమైందన్నారు.

జాయింట్ కమిషనర్‌కు ఉద్యోగుల వినతి

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పేపర మిల్లు ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని, బకాయి జీతాలు, గ్రాట్యూటీలను ఇప్పించాలని కోరుతూ మంగళవారం కార్మికశాఖ జాయింట్ కమిషనర్ నరేంద్రకుమార్ రాయికను కలసి వినతిపత్రం అందజేశారు. సంఘ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ మహంతి పాల్గొన్నారు.


వెలవెలబోతున్న గోపాల్‌పూర్ బీచ్ రోడ్

పూరీ, గోపాల్‌పూర్‌లలో హోటళ్లు ఖాళీ... గోపాలపూర్, న్యూస్‌టుడే: తుపానును దృష్ట్యా యంత్రాంగం పూరీ, గోపాల్‌పూర్‌లలోని హోటళ్లలో పర్యాటకుల్ని సాగనంపింది. బుకింగ్‌లు రద్దు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంగళవారం హోటళ్లు ఖాళీ అయ్యాయి. తీర ఘాట్‌ల వద్ద లైఫ్‌గార్డులు, అగ్నిమాపక జవానులను నియమిస్తున్నారు. సముద్ర స్నానాలు నిషేధించారు. తదుపరి ఆదేశాల వరకు పర్యాటకులు పూరీ, గోపాల్‌పూర్‌లకు రావద్దని పాలనాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం నుంచి పూరీ బీచ్‌కు ఎవరు రాకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పూరీ పాలనాధికారి సిద్ధార్థశంకర్ స్వయిన్ విలేకర్లకు చెప్పారు.

సీఎంతో ఎస్సీ, ఎస్టీ సంఘం సమావేశం


పార్లమెంటు బృందం ప్రతినిధులతో ముఖ్యమంత్రి మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ పార్లమెంటు సభాసంఘం అధ్యక్షుడు డాక్టర్ ఫగన్‌కుమార్ కులస్తె అధ్యక్షతన ప్రతినిధి బృందం సోమవారం రాత్రి భువనేశ్వర్ చేరుకుంది. మంగళవారం లోక్‌సేవా భవన్‌లో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝితో సమావేశమైంది. ఈ సందర్భంగా ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో అమలు పరుస్తున్న కార్యక్రమాల గురించి సీఎం బృందం సభ్యులకు వివరించారు. త్వరలో పెసా చట్టం కార్యరూపం దాలుస్తుందని చెప్పారు.

పంట పొలాల్లో కేళీలు


కేళీలతో(మీసాల ధాన్యం) నిండిన పంట పొలం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా గుసాని సమితి మధుసూదనపురం, బొమ్మిక పంచాయతీ పరిధిలోని వరిలో కేళీలు(మీసాల ధాన్యం) కనిపిస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ అధికారులు కల్తీ విత్తనాల సరఫరా చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. దీంతో వరి పంట దిగుబడి తగ్గిపోవడమే కాకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు, వ్యాపారులు ముందుకు రారని రైతన్నలు వాపోతున్నారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారులకు 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

విజిలెన్స్ వలలో ఇంజినీరు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంఝర్ జిల్లా వైతరణి బేసిన్ ప్రాజెక్ట్ ప్రధాన ఇంజినీరు కైలాస్‌చంద్ర సాహు మంగళవారం విజిలెన్స్ వలలో చిక్కారు. ఆదాయానికి మించి పూరీ, ఖుర్దా, జాజ్‌పూర్, కటక్, కేంఝర్ ప్రాంతాల్లో పదిచోట్ల ఆస్తులు సంపాదించారన్న అభియోగం మేరకు అధికారులు సోదాలు చేశారు. ఆయాచోట్ల ఖరీదైన భవనాలు, ప్లాట్లు, నగలు, నగదు, బ్యాంకు డిపాజిట్లు కనుగొన్నారు. విజిలెన్స్ అధికారుల సోదాలు కొనసాగుతున్నందున పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అవకాశాలను సద్వినియోగపర్చుకోవాలి


హాజరైన అభ్యర్థులు, సిబ్బంది

రాయగడ, న్యూస్‌టుడే: పారిశ్రామిక శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులు అప్రంటీస్ చేసేందుకు పరిశ్రమలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగపర్చుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం బిజయకుమార్‌సాహు అన్నారు. మంగళవారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో అప్రంటీస్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రధానాచార్యుడు బి.కె.బసంతరాయి అధ్యక్షతన జిల్లా ఉపాధి కల్పనాధికారి తత్వమసి మహాపాత్రో, శిక్షణ అధికారి ఎన్.శర్మ ఉన్నారు. భారీ పరిశ్రమలైన జేకే పేపర్‌మిల్, ఉత్కళ అల్యూమినా, వేదాంత పరిశ్రమల ప్రతినిధులు హాజరైన అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు.

వైద్యుని గైర్హాజరుపై విచారణ

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ప్రజలకు వైద్యసేవలను మరింత చేరువచేసేందుకు గతంలో రింగురోడ్డు వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ వైద్య సేవలందక రోగులు నానా అవస్థలు పడుతున్నారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న రోహిత్‌కుందు తరచూ గైర్హాజరు అవుతున్నారు. దీనిపై కొద్దిరోజులుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ముఖ్య వైద్యాధికారి లాల్‌మోహన్ రౌత్రాయ్ విచారణకు ఆదేశించారు. జిల్లా ప్రజారోగ్య అధికారి మమతాచౌదరి, ఏడీపీహెచ్‌ఓ ప్రదీప్తకుమార్ సుబుద్ధి ఆసుపత్రికి చేరుకుని విచారించారు. దస్త్రాలను అధికార బృందం పరిశీలించారు.

తప్పిన ముప్పు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భద్రక్ జిల్లా ధమ్రా పరిధిలోని వైతరణి చేపల రేవులో మంగళవారం లంగరు వేసిన ఒక మరపడవ మునిగిపోయింది. ఇందులో 10 మంది మత్స్యకారులున్నారు. వారంతా సురక్షితంగా బయటపడ్డారు. దిఘా (పశ్చిమబెంగాల్) ప్రాంతానికి చెందిన మత్స్యకారులు చేపల వేటకు వెళ్లి వాతావరణ అధ్యయనశాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో వైతరణి రేవుకు చేరి పడవ లంగరు వేశారు. యాంత్రిక లోపం వల్ల పడవ మునిగినట్లు తెలిసింది.

సంద్రం అల్లకల్లోలం


ప్రచారం చేస్తున్న అధికారులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: 'దానా' తుపాను కారణంగా తూర్పు మిడ్నాపూర్ జిల్లా ప్రముఖ పర్యాటక కేంద్రం దిఘాలో రెడ్ ఎలెర్ట్ ప్రకటించారు. దిఘా సముద్రం అల్లకల్లోలంగా ఉంది. పర్యాటకులు ఎవరూ సముద్రతీరం వైపునకు వెళ్లరాదని, మత్స్యకారులు చేపలు పట్టడానికి వెళ్లరాదని కోస్ట్‌గార్డులు మైకు ద్వారా ప్రచారం చేస్తున్నారు.

కలప ముక్కలతో కళాకృతులు


దిగపాహండి శాసనసభ్యుడు సిద్ధాంత్ మహాపాత్రోకు ఆయన చిత్రమున్న కళాకృతిని అందజేస్తున కళాకారుడు అరుణ్ సాహు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కలప ముక్కలపై తీర్చిదిద్దిన ఏడు అద్భుతాలు, హనుమాన్ చాలీసా వంటి కళాకృతులు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని గంజాం జిల్లా దిగపాహండి శాసనసభ్యుడు సిద్ధాంత్ మహాపాత్ర్ అన్నారు. గంజాం జిల్లా హింజిలి సమితిలోని కొంటెయికొళి గ్రామానికి చెందిన కళాకారుడు అరుణ్‌కుమార్ సాహు బ్రహ్మపురలో చిన్న బజారు సమీపాన కపిలేశ్వరపేటలో అరుణ్ ఉడ్ ఆర్ట్స్ పేరిట కళాకృతుల ప్రదర్శన, వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం దీన్ని ప్రారంభించిన శాసనసభ్యుడు మహాపాత్ర్ కళాకృతులు తిలకించి, కళాకారుడు సాహు అభినందించారు. అతిథులకు కలపపై చెక్కిన వారి చిత్రాలున్న కళాకృతులను సాహు జ్ఞాపికలుగా అందజేశారు.

అవీ..ఇవీ..అన్నీ

ఖరగ్‌పూర్: ఆదిత్య బిర్లా గ్రూప్ పెయింట్స్ పరిశ్రమలో ఉద్యోగాల భర్తీలో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని భూమినిచ్చిన వారు సోమవారం ఆందోళన చేపట్టారు. ★ కోల్‌కతాలో ఈ నెల 20వ తేదీన ఇంద్రజాల పోటీలు జరిగాయి. వీటిలో నింపురానికి చెందిన అదితి ప్రథమ స్థానంలో నిలిచింది. ఆమెకు నిర్వాహకులు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. ★ మిడ్నాపూర్ శాసనసభ ఉప ఎన్నికల వామపక్ష కూటమి సీపీఐ అభ్యర్థి మణికొంతల కొమరాయి పేరును ఖరారు చేశారు. వామపక్ష పార్టీలు ఈ అభ్యర్థిని బలపర్చి గెలిపించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.

నవరంగపూర్: నవరంగపూర్ జిల్లా జోరిగావ్ సమితిలో రాజ్యసభ ఎంపీ మున్నాఖాన్, మాజీ ఎంపీ బిజద నేత ప్రదీప్‌మాఝి మంగళవారం పర్యటించారు. సమితిలో నిర్మాణ దశలో నిలిచిపోయి ఉన్న పలు ప్రాజెక్టులను పరిశీలించారు.★ జిల్లాలో స్థానిక నిరుద్యోగులను ఉపాధ్యాయులుగా నియమించాలని కోరుతూ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు పిల్లలను తల్లిదండ్రులు బడికి పంపలేదు. పాఠశాలకు వెళ్లని విద్యార్థులకు స్థానిక యువత చెట్టు కింద పాఠాలు భోదించారు. ఉమ్మర్‌కోట్ సమితి సిరిలిగూడ గ్రామంలో మంగళవారం జరిగింది.

రాయగడ: ఏడాదిలో రెండు నెలలే శీతాకాలం ఉంటోందని, మిగిలిన కాలమంతా వేసవిని తలపిస్తోందని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పాడాలని వక్తలు అన్నారు. మంగళవారం వృక్ష ప్రేమికుడు, సామాజిక కార్యకర్తలు ఎన్‌వీఆర్ ఉన్నత పాఠశాల సంయుక్తంగా దీనిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ★ పట్టణంలో కాళీ మందిర మైదానంలో 42వ వార్షిక కాళీ పూజల కోసం భారీ ఎత్తున సన్నాహాలు ఊపందుకున్నాయి. అమ్మవారి విగ్రహంతో పాటు ఇతరదేవతల ప్రతిమలను కళాకారులు రూపొందిందిస్తున్నారు. 10 రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి.

ఖరగ్‌పూర్: మిడ్నాపూర్ శాసనసభ ఉప ఎన్నికల వామపక్ష కూటమి సీపీఐ అభ్యర్థి మణికొంతల కొమరాయి పేరును ఖరారు చేశారు.

సిమిలిగుడ: కొరాపుట్ జిల్లా మాధ్యమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం సమావేశం కొరాపుట్‌లో రాజీవ్‌గాంధీ హైస్కూల్‌లో మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు సుశాంత్‌కుమార్ ఖుంటియా అధ్యక్షతన రాష్ట్ర అధ్యక్షుడు అక్షయకుమార్ మిశ్రా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంజన్‌కుమార్‌దాస్, సంయుక్త ప్రధాన కార్యదర్శి, కొరాపుట్ జిల్లా ఇన్‌ఛార్జి బ్రజకిషోర్ బిశ్వాల్‌తో వివిధ పాఠశాలల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలల సమస్యలపై చర్చించారు.

మల్కాన్‌గిరి: మల్కాన్‌గిరి జిల్లాలో మాల్యవంత మహోత్సవాలకు ముందస్తు సమావేశం జరిగింది. మంగళవారం మల్కాన్‌గిరి జిల్లా పరిషత్ సమావేశ గృహంలో పాలనాధికారి ఆశిష్ ఈశ్వర్ పాటిల్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.

సిమిలిగుడ: సిమిలిగుడకు చెందిన సహీద్‌లక్ష్మణ్ నాయక్ ఆటోడ్రైవర్ల సంఘానికి సంబంధించి మంగళవారం నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. కొత్త కార్యవర్గం ఎంపికలో అధ్యక్షుడిగా సంగ్రామ్‌కుల్‌దీప్, ఉపాధ్యక్షులుగా రబి, కార్యదర్శిగా కిరణ్‌పంగి తదితరులు ఉన్నారు. ★ సిమిలిగుడకు చెందిన సునాబెడ ట్రక్ అండ్ టిప్పర్ యజమానుల సంఘం ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక కల్యాణ మండపంలో ఉదయం నుంచి భారీ భద్రత మధ్య పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారిగా అసిస్టెంట్ కలెక్టర్ భగవాన్ నాయక్ వ్యవహరించగా, పర్యవేక్షకులుగా అధికారులు రెవెన్యూ అధికారులు శ్రీకాంత్ గౌడ్, ప్రియదర్శిని బాగ్ ఆధ్వర్యంలో పోలింగ్ జరిగింది. సాయంత్రం ఓట్ల లెక్కింపు ముగిసింది. ★ ఈ నెల 27వ తేదీన దుదారిలో మౌళిమా మందిర వద్ద ప్రారంభమయ్యే పరబ్ వేడుకలకు అత్యంత వైభవంగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే రామచంద్రకడం సూచించారు. దీని నిర్వహణపై పలు కమిటీలను ఏర్పాటు చేశారు.

జయపురం: జయపురం సమితిలో ఈనెల 26వ తేదీన సమితి ఉపాధ్యాయుల సంఘం ఎన్నికలు జరగనున్నాయి.

జయపురం: జయపురం పట్టణంలో అభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం 15 అడుగుల గల విద్యుత్తు స్తంభాలను తొలగించి 20 అడుగుల ఎత్తైన స్తంభాలను ఆ శాఖ ఇటీవల ఏర్పాటు చేసింది. దీంతో పలుచోట్ల ఉన్న స్తంభాల తీగలకు భారీ వృక్షాలు కొమ్మలు అడ్డంగా ఉన్నాయి. దీన్ని దృష్ట్యా మంగళవారం ఆ శాఖ తరఫున మరమ్మతుల పనులు చేపట్టడంతో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేశారు.



పూర్వం గిరిజనులు వాడిన వివిధ రకాల వస్తువులు, వేటాడే పరికరాలు




అడవుల్లో దొరికే మన్యం ఉత్పత్తులు

మురిపించేలా మ్యూజియం

ప్రాచీన కాలంలో గిరిజనుల అలవాట్లు.. వారి సంస్కృతి, సంప్రదాయాలు.. నైపుణ్యంతో కూడిన జానపద కళలు.. విభిన్న నృత్యరీతులు.. ప్రతిఒక్కరినీ అలరిస్తాయి.. ఆలోచింపజేస్తాయి. ఈ నేపథ్యంలో నాటి జీవన విధానాన్ని తెలియజేస్తూ ఇటీవల కురుపాం మండలం చింతమానుగూడ ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గిరిజన కళాక్షేత్రం ఆకట్టుకుంటోంది. మినీ మ్యూజియంగా కొత్త అందాలను సంతరించుకున్న ఈ కేంద్రంలో గిరిజనుల జీవన శైలి ఉట్టిపడేలా కళాకృతులను ఏర్పాటు చేశారు. చిత్రాలు, వివిధ రకాల సాధనాలు, వేట పరికరాలు, పంట ఉత్పత్తులు, మూలికలు, ప్రతిమలను ప్రదర్శిస్తున్నారు. భావితరాలకు ఇదో అపురూప కానుకని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ సందర్శించాలని కోరారు. - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం



గిరిజనుల జీవన విధానాన్ని తెలిపే చిత్రాలు



జాతీయ పారా స్విమ్మింగ్ పోటీల్లో రాష్ట్రానికి పతకాలు



కమలకాంత నాయక్



నరహరి బెహరా



ఆకాష్ బంచర్



దినేష్‌మోహన్ మఝి

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గోవాలో ఈ నెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగిన 24వ జాతీయ పారాస్విమ్మింగ్ పోటీల్లో ఆరుగురు రాష్ట్ర క్రీడాకారులు పతకాలు దక్కించుకున్నారు. ఈమేరకు రాష్ట్ర క్రీడావిభాగం ఆ వివరాలను మంగళవారం 'ఎక్స్'లో వెల్లడించింది. పోటీల్లో ఎస్-6 కేటగిరీలో 100 మీటర్ల ఫ్రీస్టైల్ అంశంలో చైతన్య మరండి కాంస్య పతకం, ఎస్-4 కేటగిరీలో 100 మీటర్ల ఫ్రీస్టైల్, 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కమలకాంత్ నాయక్ పసిడి, రజత పతకాలు గెలుచుకున్నారు. ఎస్-5 కేటగిరీలో 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో నరహరి బెహరా పసిడి పతకం, 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో ఆకాష్ బంచర్ పసిడి పతకం, ఎస్-10 కేటగిరీలో 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో దినేష్ మోహన్ మాఝి పసిడి పతకం, మహిళా విభాగంలో ఎస్-6 కేటగిరీలో 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కబితా దొళాయి రెండు రజత పతకాలు సాధించారు. పతకాల విజేతలకు క్రీడావిభాగం అభినందనలు తెలిపింది.

హంస వాహనంపై ఇలవేల్పు వైభవం



అలంకరణలో చదురుగుడి, వనంగుడి అమ్మవార్లు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం మంగళవారం సాయంత్రం కనులపండువగా సాగింది. ఆలయ సహాయ కమిషనర్ డీవీవీ.ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తల్లి సేవకుల నేతృత్వంలో పెద్ద చెరువు పశ్చిమ భాగాన వైభవంగా జరిగింది. మధ్యాహ్నం వేదసభ, అమ్మవారికి స్నపన, క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక అలంకరణతో కూడిన పల్లకిలో ప్రతిష్ఠించి, వేదపండితులు, అర్చకుల మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా గాడీఖానాకు తీసుకొచ్చారు. 5.30 గంటలకు రాజహంస ఆకారంలోని తెప్పపై తల్లి కొలువుదీరింది. దేవస్థానం సిబ్బంది, వేదపండితులు, డీఎస్పీ శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో మూడుసార్లు తెప్పను చెరువు చుట్టూ తిప్పారు. ఈ సందర్భంగా దర్శనాలకు భక్తులు బారులుదీరారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గస్తీ నిర్వహించారు. రాత్రి వనంగుడిలో మెట్లోత్సవం చేపట్టారు.



తల్లి దర్శనానికి బారులుదీరిన భక్తులు



ఉత్సవ విగ్రహానికి పసుపుతో అభిషేకం చేస్తున్న ప్రసాదరావు, నిత్య సేవకులు, దీక్షాధారులు



పెద్ద చెరువులో హంస వాహనంపై విహరిస్తున్న అమ్మవారు

అవస్థల్లో ఆపద్బాంధవులు..

● నిలువ నీడ లేక విశ్రాంతి కరవు ● ఆరుబయటే 108 వాహనాల నిలిపివేత

ఆపద సమయంలో అత్యవసర వైద్య సేవలందించే 108 వాహనాల సిబ్బంది నిలువ నీడ లేక అవస్థలు పడుతున్నారు. షెడ్లు లేక వాహనాలు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ రహదారుల పక్కన ఉంటున్నాయి. ఆసుపత్రుల పరిధిలో వసతులు కల్పించాలని కొన్నేళ్లుగా కోరుతున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు.

– న్యూస్‌టుడే, సోంపేట, కంచిలి గ్రామీణం



కంచిలిలో అసంపూర్తిగా 108 ఉద్యోగుల విశ్రాంతి భవనం

..జిల్లాలో 30 కేంద్రాల ద్వారా 31 అంబులెన్సులు అత్యవసర వైద్య సేవలందిస్తున్నాయి. 158 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, మెళియాపుట్టి, టెక్కలి (నవజాత శిశువుల వాహనం), పోలాకి, గార, ఆమదాలవలస, శ్రీకాకుళం, పలాస, కంచిలిలో సిబ్బందికి కొన్ని ప్రభుత్వ సంస్థల కార్యాలయాల్లో తాత్కాలిక వసతి ఏర్పాటు చేశారు. ఖాళీగా ఉన్న గదులను వినియోగించడం తప్ప ఎలాంటి సదుపాయాలు లేవు. శ్రీకాకుళంలో నీటిపారుదల శాఖకు సంబంధించిన శిథిల గదిని కేటాయించడంతో పెద్దగా ఉపయోగపడటం లేదు. ఎప్పుడు కూలుతుందో తెలియని ఆ గదిలోనే సిబ్బంది విశ్రాంతి తీసుకుంటున్నారు. పలాస ఎన్జీవో భవనం, కంచిలిలో కేంద్ర సహకార బ్యాంకుకు సంబంధించిన గదులను వినియోగిస్తున్నారు. చాలాచోట్ల ప్రభుత్వాసుపత్రుల్లోని వరండా, ఖాళీగా ఉన్న గదుల్లో ఉంటున్నారు. 19 కేంద్రాల్లో విశ్రాంతి తీసుకోవడానికి అవకాశం లేక ఆరుబయట ఉంటున్నారు.

◆ కంచిలిలో దాతల సహకారంతో నిర్మిస్తున్న విశ్రాంతి గది నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిధుల కొరత తలెత్తడంతో సమస్య నెలకొంది.

◆ 108 వాహనాలను నిలపడానికి షెడ్లు లేక అందులో నిల్వ చేసే మందులు దెబ్బతింటున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర ఉష్ణోగ్రత, భారీ వర్షాల సమయంలో ఆరుబయట ఉండే వాహనాల్లోని మందులు ఉపయోగపడటం లేదని తెలిపారు.

◆ అత్యవసర వాహనాలను అన్ని విధులకు వినియోగించేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో సమస్యలు నెలకొన్నాయి. సామాజిక ఆసుపత్రుల నుంచి జ్వరాల కేసులు, ఇతర చిన్న ఇబ్బందులతో బాధపడుతున్న రోగులను సైతం ఇతర ఆసుపత్రులకు పంపుతుండటంతో రిఫరల్ వాహనంగా ఉపయోగించే పరిస్థితి ఏర్పడింది. ప్రమాదాలు, అత్యవసర సమయాలలో వాహనాలు అందుబాటులో ఉండటం లేదు.

ట్రాఫిక్ సమస్యతో చిక్కులు..: సమాచారం వచ్చిన వెంటనే వాహనం కదిలేందుకు అవకాశం లేని పరిస్థితి. చాలా ప్రాంతాల్లో సిబ్బంది ఎక్కడ ఉండాలో తెలియడం లేదు. ప్రత్యేకంగా వసతి గదులు, షెడ్లు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలి.
- విజయ్‌మోహన్, 108 ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు

వైద్యారోగ్య శాఖతో సమన్వయం చేస్తాం..: సిబ్బందికి వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో గది కేటాయించేలా అధికారులతో మాట్లాడాం. వైద్యారోగ్య శాఖతో సమన్వయం చేసుకుంటూ వసతి, వాహనాలు ఉంచేలా ఏర్పాట్లు చేసేలా పర్యవేక్షిస్తాం. - హరిప్రసాద్, డీఎం, 108 వాహనాల నిర్వహణ సంస్థ

వరద బాధితులకు సహాయం

పార్వతీపురం గ్రామీణం, బలిజిపేట, సీతానగరం, న్యూస్‌టుడే: వరద బాధితులకు సాయంగా ముందుకు వచ్చిన వారిని ఎమ్మెల్యే విజయచంద్ర అభినందించారు. మంగళవారం బలిజిపేట మండలానికి చెందిన నాయకులు సేకరించిన రూ.3.65 లక్షలు ఎమ్మెల్యేకు అందజేశారు. పెదపెంకి గ్రామస్థులు- రూ.1.25 లక్షలు, సుభద్ర గ్రామం- రూ.40 వేలు, వంతరాం- రూ.35 వేలు, జనార్దనవలస- రూ.28,900, అరసాడ- రూ.25 వేలు, నూకలవాడ- రూ.20 వేలు, మురగడం- రూ.20 వేలు, బలిజిపేట- రూ.15 వేలు, వెంగాపురం- రూ.15 వేలు, మిర్తివలస, బర్లి, రావివలస గ్రామస్థులు రూ.10 వేలు చొప్పున, పెద్దింపేట- రూ.7 వేలు, చెల్లంపేట, శివరాంపురం ప్రజలు రూ.5 వేలు అందజేశారు.
* సీతానగరం మండలంలోని కోటసీతారాంపురానికి చెందిన కె.రామకృష్ణ, సీహెచ్.కృష్ణమూర్తి, సీహెచ్.రామారావు, సీహెచ్.వెంకటరమణ రూ.15 వేలు నగదును ఎమ్మెల్యేకు ఇచ్చారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు పేర్కొన్నారు. సంఘ ప్రథమ మహాసభలు మంగళవారంతో ముగించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై పూర్తి స్థాయిలో ఉద్యమించాలని కార్యవర్గ సభ్యులకు సూచించారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా భీమరాజ్, రవికుమార్, 15 సభ్యులు ఎన్నికయ్యారు.

రక్షణ కరవు

వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి ఉన్నత పాఠశాలకు ముఖ ద్వారం లేకపోడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రీడా మైదానంలో పశువులు, కుక్కలు మూత్ర, మల విసర్జన చేసి పాడు చేస్తున్నాయని, మధ్యాహ్న భోజనం, ఆటల సమయంలో నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. నాడు-నేడు పనులకు సంబంధించి నిల్వ చేసిన ఇసుక, ఇతర సామగ్రి సైతం చోరీకి గురవుతున్నట్లు విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి ముఖ ద్వారం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంఈవో దశరథ తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు



సేంద్రియ పంటలతో ఆరోగ్యం

భామిని, న్యూస్‌టుడే: రైతులు సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండిస్తే దిగుబడులతోపాటు ఆరోగ్యం సొంతం అవుతుందని ఏవో సింహాచలం అన్నారు. మంగళవారం ఘనసర, బాలేరులో రైతులకు జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. * సీతంపేట: సుడిదోమ, ఆకుముడత దోమ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో పి.శ్రీదేవి తెలిపారు. దేవనాపురం, గుమ్మడలో కషాయాలపై రైతులకు వివరించారు.

వ్యర్థాల కుప్పలు.. ప్రజలకు తిప్పలు

పలాస మండలం బ్రాహ్మణతర్లాలోని కడి వీధి వద్ద రోడ్డు పక్కనే చెత్త పారబోస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరేఖ దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.
– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం



ఇరుకు.. గోతులు..

మందస మండలం కొర్రాయిగేటు నుంచి సువర్ణాపురం వెళ్లే రహదారి తీవ్ర అసౌకర్యంగా మారింది. రెండు వైపులా పొదలు అల్లుకోవడంతో ఇరుకుగా తయారైంది. అల్లిమెరక కూడలి నుంచి పూజానగర్ వరకు అడుగడుగునా గోతులు ఏర్పడి రాళ్లు తేలాయి. వాహనాలు నడపడమూ కష్టంగా ఉందని చోదకులు వాపోతున్నారు. ఈ రహదారి అభివృద్ధికి గతంలో నిధులు వచ్చాయి. సకాలంలో పూర్తిచేయక వెనక్కి మళ్లాయి. మళ్లీ ప్రతిపాదనలు పంపించామని పంచాయతీరాజ్ డీఈఈ రవిబాబు తెలిపారు.
– న్యూస్‌టుడే, హరిపురం (మందస)



రైతేరాజు

చిట్టి ముత్యాలు.. రైతుకు సిరులు..!

ప్రకృతి సాగుతో దిగుబడులు సాధిస్తున్న రౌతుపురం వాసి

–న్యూస్‌టుడే, నందిగాం, జలుమూరు



సాగులో ఉన్న చిట్టి ముత్యాలు వరి రకం పంట

దేశ సైన్యంలో హవల్దారుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన తరువాత ప్రకృతి సాగు చేస్తూ విభిన్న పంటలు పండించి ఆదర్శంగా నిలుస్తున్నాడు నందిగాం మండలం సైలాడ పంచాయతీ రౌతుపురం గ్రామానికి చెందిన బొడ్డ జగన్నాథం. రసాయన ఎరువుల జోలికి పోకుండా గోమూత్రం, పశువుల వ్యర్థాలు వంటి సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తున్నారు. కొన్నేళ్లుగా పురాతన వరి విత్తనమైన 'చిట్టి ముత్యాలు' అనే ఎరుపు రకానికి చెందిన వరి పంటను ఎకరం పొలంలో సాగు చేస్తున్నారు. ఈ పంట 135 రోజులకు చేతికి అందుతుంది. విత్తనాలు, నారు పోసేందుకు, దమ్ము చేసేందుకు, నాట్లు వేసేందుకు, కోత ఇలా పంట చేతికి అందేసరికి రూ.20 వేల వరకు ఖర్చవుతుంది. ధాన్యం ఎకరాకు 20 బస్తాలు (80 కిలోలు) దిగుబడి వస్తోంది. అత్యంత సువాసనతో కూడిన ఈ ధాన్యం మధుమేహం రాకుండా తోడ్పడుతుంది. కేజీ ధాన్యం ధర మార్కెట్‌లో రూ.60 పలుకుతోంది. 80 కిలోల బస్తా రూ.4,800 పలుకుతోంది. 20 బస్తాలకు రూ.96 వేలు వస్తుంది. పెట్టుబడి పోను రూ.76 వేల ఆదాయం వస్తుందని రైతు జగన్నాథం తెలిపారు.



ఆదాయం బాగుంది: చిట్టి ముత్యాలు వరి రకంపురాతనమైనది. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం ఊపందుకోబట్టి మన రైతులు పలు చోట్ల ఇలాంటి పంటలను పండిస్తున్నారు. నేను ప్రకృతి వ్యవసాయాన్ని నమ్ముకున్నాను. దీన్ని ఎకరం పొలంలో సాగు చేసి మంచి ఆదాయం పొందుతున్నాను. – బొడ్డ జగన్నాథం, రైతు, రౌతుపురం

సస్య రక్షణ చర్యలు ఇలా..

బీజామృతంతో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. మొక్కకు మొక్కకు 12 సెం.మీ. దూరం ఉండేలా నాట్లు వేసుకోవాలి. గాలి, వెలుతురు సమృద్ధిగా తగిలి మొక్క ఆరోగ్యంగా పెరుగుతుంది. మొక్క ఎదుగుదలకు ఘన, ద్రవ జీవామృతాలను పిచికారీ చేయాలి. ఏదైనా తెగులు ఆశిస్తే జిల్లేడు కషాయం, వేప నూనె వంటివి పొలంపై చల్లాలి. పొట్ట దశలో దశపత్ర కషాయం పిచికారీ చేస్తే మంచిది. రసాయనిక ఎరువులు వినియోగించకపోవడంతో అంతగా చీడపీడలు దరి చేరవని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ వర్మ తెలిపారు.

గొర్రెల్లో మూతిపుండ్లు.. నివారణ



జలుమూరు, పాతపట్నం, న్యూస్‌టుడే: శీతాకాలంలో గొర్రెలు, మేకల్లో మూతి పుండ్లు వస్తాయని, వీటి నివారణకు రైతులు తగిన జాగ్రత్తలను తీసుకోవాల్సి ఉందని అచ్యుతాపురం పశువైద్యాధికారి పట్ట సంతోష్‌కుమార్ తెలిపారు. ఇది ఒక గొర్రె నుంచి మరో దానికి తక్కువ సమయంలోనే వ్యాపిస్తుంది. దీని వల్ల జ్వరం రావడంతో పాటు మూతిపై పగుళ్లు ఏర్పడతాయి. గుర్తించిన వెంటనే వాటిని మంద నుంచి వేరు చేసి సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి. పెన్సిలిన్ టీకా వేయించాలి. 10 కిలోల బరువు ఉన్నదానికి 2 మి.లీ. టీకా ఇప్పించాలి. దాణా తీసుకోవడం తగ్గడం వల్ల గొర్రెలు బరువు తగ్గుతాయి. వ్యాధి సోకిన వెంటనే చర్యలు చేపడితే నివారించవచ్చని ఆయన సూచించారు.

చూడి పశువుల సంరక్షణ



సరుబుజ్జిలి, పొందూరు న్యూస్‌టుడే: చూడి పశువులకు గర్భస్రావం అవుతుండటం వల్ల పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సమస్య ఏర్పడకుండా పశుపోషకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సరుబుజ్జిలి పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.సుబ్రహ్మణ్యం వివరించారు. పశువులను మేతకు తీసుకువెళ్లే సమయంలో మందలోని ఇతర పశువులు పొడవడం, అధిక ఉష్ణోగ్రతలు, మినపపొట్టు, ఉలవలు, పిల్లిపెసర, చెరకు వ్యర్థాలు ఎక్కువగా తినడం వల్ల వాటిలో ఈస్ట్రోజన్ అధికమవ్వడం, హార్మోన్ల అసమతుల్యతతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది.

ఇలా చేస్తే మేలు: పశువులు ఎదకు వచ్చిన సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించడం ఉత్తమం. చల్లని ప్రదేశాల్లో ఉంచాలి. ఇవి సాధారణంగా ఏడో నెలలో గర్భస్రావానికి గురవుతుంటాయి. పశువులకు మిశ్రమ దాణా, పచ్చి మేత తినిపించాలి.

చేప పిల్లల పెంపకం.. జాగ్రత్తలు



చెరువుల్లో చేప పిల్లల పెంపకం చేపట్టిన రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తే వాటిని కాపాడుకుంటూ మంచి లాభాలను పొందవచ్చునో ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు ఆయన ఇలా సమాధానాలిచ్చారు.
– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

ప్రశ్న: చెరువులో పెంపకం చేపట్టిన చేపల చర్మంపై ఎర్రని మచ్చలు ఏర్పడటం, పొలుసులు ఊడిపోవడంతో చనిపోతున్నాయి. వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి.
– డి.సూర్యనారాయణ, సింగుపురం

సమాధానం: చేపల చెరువుల్లో మురుగు ఎక్కువై, బ్యాక్టీరియా సాంద్రత పెరగడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోంది. చెరువుల్లో 2 శాతం బ్రోమిన్ ద్రావణం లేదా 50 శాతం బీకేసీ ద్రావణం ఎకరాకు లీటరు చొప్పున వేసినట్లయితే ఈ వ్యాధి ఉధృతి తగ్గుతుంది. వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నప్పుడు మేతలు, ఎరువులు వేయరాదు.

ప్రశ్న: చేపల చెరువుల్లో పసర ఎక్కువగా ఉండి తెట్టుగా తయారవుతోంది. ఏ చర్యలు తీసుకుంటే చేపలకు నష్టం వాటిల్లదు.
–ఎస్.రామారావు, ఆమదాలవలస

సమాధానం: చేపల చెరువుల్లో ప్లవకాల సాంద్రత ఎక్కువైనప్పుడు ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో నీటి గుణాల్లో మార్పులు వచ్చి చేపలపై ఒత్తిడి ఏర్పడుతుంది. ఎకరాకు 400 గ్రాములు కాపర్ సల్ఫేట్‌ను వాడుకుంటే చెరువుల్లో పసరు తగ్గించుకోవచ్చు.

సందడిగా గజలక్ష్మీ ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న పురసంస్థ అధ్యక్షురాలు మమతా గౌడొ, ఉపాధ్యక్షుడు శివప్రసాద్ గౌడొ ఇతరులు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురంలో గజలక్ష్మీ ఉత్సవాల్లో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సోమవారం గుణుపురం ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగ్ పట్టణంలో అన్ని మండపాల్లో అమ్మవార్లను దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం బిజద నాయకులు సుధీర్ దాస్, మాజీ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగ్ ఇతర నాయకులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. సోమవారం రాత్రి గజపతి జిల్లా కళాకారులు భారతీ లీల నృత్య రూపకం ప్రదర్శించారు. పురసంస్థ అధ్యక్షురాలు మమతా గౌడొ, ఉపాధ్యక్షులు శివప్రసాద్ గౌడొ తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులను బాధిస్తే శిక్ష తప్పదు



గోడ ప్రతులు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు, వయోవృద్ధులను నిరాదరణకు గురి చేస్తే శిక్షార్హులని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. వయోవృద్ధుల సంక్షేమ శాఖ రూపొందించిన గోడ ప్రతులను కలెక్టర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. 60 ఏళ్ల పైబడిన వారి రక్షణ బాధ్యత పిల్లలదేనన్నారు. తల్లిదండ్రుల పోషణ, వైద్య వ్యయాలకు నెలకు రూ.10 వేలు చెల్లించాలన్నారు. పిల్లలు ఇబ్బందులకు గురి చేస్తే ఆర్డీవోకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడు, అధికారులు కవిత, రామచంద్రరావు, పగడాలమ్మ పాల్గొన్నారు.

భూమి పట్టాల పంపిణీ



పట్టాను అందజేస్తున్న శాసనసభ్యుడు, సబ్‌కలెక్టర్

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం బర్నిపుట్ పంచాయతీ ముండిగూడ, ఓసీసీ కాలనీలో నిరాశ్రయులకు ప్రభుత్వ స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ముండిగూడలో తహసీల్దార్ సబ్యశాచి జెనా అధ్యక్షతనలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యుడు తారాప్రసాద్ వాహినీపతి, సబ్‌కలెక్టర్ ఎ.సస్యరెడ్డి హాజరయ్యారు. ఎల్లో బ్రిడ్జి-ఓసీసీ కాలనీ మధ్యలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని 49 కుటుంబాలకు అందజేసినట్టు ఆర్ఐ హరిహర్‌శత్పధి తెలిపారు.

ఘనంగా గౌరీ ఉత్సవాలు

పాలకొండ గ్రామీణం: తుమరాడ గ్రామంలో గౌరీ ఉత్సవాలు అయిదేళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. ఈ ఏడాది కుమ్మరివీధిలో ఉత్సవాలు ప్రారంభించారు. వేడుకలు వచ్చే ఏడాది మార్చి వరకు జరగనున్నాయి. తొలుత వినాయక, శివపార్వతుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. సంక్రాంతి సమయంలో వివిధ దేవతామూర్తుల ఉత్సవమూర్తులు పెడతామని నిర్వాహకులు కె.రామకృష్ణ తెలిపారు.